




మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | గురువారం 28 మే 2026 | వెల4/-


## త్యాగం.. మానవత్వానికి బక్రీద్ సందేశం

రాష్ట్ర ప్రజలకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ శుభాకాంక్షలు




బక్రీద్ పండుగ త్యాగం, విశ్వాసం, మానవత్వానికి ప్రతీక అని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. పరస్పర ప్రేమ, సోదరభావం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను బలపరిచే పండుగగా బక్రీద్ నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.



# “మహానాడులో మహా జోష్..

## చంద్రబాబు స్పీచ్‌తో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం”

- పంచ్ డైలాగ్‌లు, విజన్ పాలిటిక్స్,
- భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌పై స్పష్టమైన దిశానిర్దేశం
- ‘గొడ్డలి పార్టీ’పై ఘాటు విమర్శలు..
- యువత, మహిళలు, కార్యకర్తలకు ప్రత్యేక సందేశం



వర్చువల్ విధానంలో జరిగిన టీడీపీ మహానాడు తొలి రోజు కార్యక్రమం అద్భుతంగా ఆరంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ల నుంచి భారీగా కార్యకర్తలు పాల్గొనగా... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగం మహానాడుకు హైలైట్‌గా నిలిచింది. పార్టీ 44 ఏళ్ల సిద్ధాంతాల నుంచి భవిష్యత్ స్వర్ణాంధ్ర దిశ వరకు స్పష్టమైన విజన్‌ను ఆవిష్కరిస్తూ... వైసీపీపై ఘాటు పంచ్‌లతో చంద్రబాబు ప్రసంగం ఆసక్తికరంగా సాగింది.

**“టీడీపీ ఎన్నికల కోసం కాదు... నెక్స్ట్ జెనరేషన్ కోసం పనిచేస్తుంది”**

-- మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు స్పష్టం
యువతకు AI, క్వాంటం, స్పేస్ రంగాల్లో భారీ అవకాశాలు
23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు
మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం
“పేదలకు కావాల్సింది పథకాలు... గొడ్డలి వేట్లు కాదు” అంటూ వైసీపీపై ఘాటు విమర్శలు

**“వర్చువల్ మహానాడులో జోష్ తగ్గలేదు”**

-- 7.5 లక్షల మంది పాల్గొన్న తొలి రోజు మహానాడు
1,875 క్లస్టర్ల నుంచి కార్యకర్తల భారీ స్పందన
“పసుపు జెండా తెలుగు వారి ఆత్మగౌరవం”
స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
“గొడ్డలి పార్టీకి గోల్ లేదు... అదొక అడ్డగోల్ బ్యాచ్” అంటూ సీఎం పంచ్ డైలాగ్స్

వివరాలు 2వ పేజీలో

## “మహానాడులో లోకేష్ మాస్టర్ స్ట్రోక్...

మహిళలకు 33% సీట్లతో చారిత్రాత్మక సంకేతం”
‘ఇది మా కమిట్‌మెంట్’ అంటూ లోకేష్ ప్రశంగం..
రిజర్వేషన్లపై సంచలన ప్రకటన
వైసీపీపై ఘాటు పంచ్‌లు...
భవిష్యత్ రాజకీయాలపై స్పష్టమైన దిశానిర్దేశం




తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా యువనేత నారా లోకేష్ చేసిన మహిళలకు 33 శాతం సీట్ల కేటాయింపు ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మహిళా సాధికారత నుంచి అభివృద్ధి, సంక్షేమం, వైసీపీపై రాజకీయ దాడుల వరకు లోకేష్ ప్రసంగం పంచ్ డైలాగ్‌లు, ఘాటు విమర్శలు, భవిష్యత్ వ్యూహాలతో మహానాడు వేదికను ఉత్సాహభరితంగా మార్చింది.

## గోదావరి పవిత్రతపై కూటమి సర్కార్ ఫోకస్

కాలుష్యంపై కఠిన హెచ్చరికలు.. పుష్కరాలకు భారీ మాస్టర్ ప్లాన్




గోదావరి నది కాలుష్య నివారణ, 2027 మహా పుష్కరాల నిర్వహణపై ప్రభుత్వం దూకుడు పెంచింది. కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. పుష్కరాలను ప్లాస్టిక్ రహితంగా, కుంభమేళా తరహాలో నిర్వహించేందుకు రూ.8,500 కోట్లతో భారీ ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు.

## విద్యుత్ అంతరాయాలపై అలర్ట్




ప్రజలకు ముందస్తు సమాచారం..
1912 కాల్ సెంటర్లకు కీలక బాధ్యతలు

అధిక ఉష్ణోగ్రతలు, అకాల గాలివానల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలపై ముందస్తు సమాచారం అందించడంతో పాటు 1912 కాల్ సెంటర్లను సమర్థవంతంగా పనిచేయించాలని సూచించారు.

## రైల్వే డబ్లింగ్‌కు వేగం

ధోన్--మహబూబ్‌నగర్ ప్రాజెక్టుపై ప్రధాని మోదీకి రాష్ట్ర నివేదిక




వివరాలు 2వ పేజీలో



ఆంధ్రప్రదేశ్‌లో కీలక రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. ధోన్--మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, ప్రభుత్వ భూముల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించారు. ప్రగతి వీడియో కాన్ఫరెన్స్‌లో జాతీయ మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది.

# రైల్వే డబ్లింగ్‌కు వేగం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్ :**

దేశవ్యాప్తంగా కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన 'ప్రగతి' వీడియో కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ... ముద్ఖేడ్--మెద్చల్--మహబూబ్‌నగర్--ధోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర పరిధిలో భూసేకరణ, ప్రభుత్వ భూముల బదలాయింపు ప్రక్రియను వేగంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ధోన్--మహబూబ్‌నగర్ రైల్వే ప్రాజెక్టు కోసం రాష్ట్రంలో మొత్తం 23.07 హెక్టార్ల ప్రైవేట్ భూమి అవసరమైందని వివరించారు. దీనికి సంబంధించి సెక్షన్ 20(ఏ) నోటిఫికేషన్‌ను ఇప్పటికే 2025 సెప్టెంబర్ 25న జారీ చేసినట్లు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో 18.21 హెక్టార్ల భూమి నాలుగు మండలాల్లోని 16 గ్రామాల్లో అవసరమైందని, అందులో ఎనిమిది గ్రామాల్లో పెగ్ మార్కింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ప్రక్రియ కొనసాగుతోందని, మరో రెండు వారాల్లో 20(జు) నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో అవసరమైన 4.86 హెక్టార్ల భూమికి సంబంధించిన పెగ్ మార్కింగ్ పూర్తయిందని, 20(జు) నోటిఫికేషన్ ఇప్పటికే జారీ చేసినట్లు సీఎస్ వివరించారు. మొత్తం 4.05 హెక్టార్ల ప్రభుత్వ భూమి బదలాయింపుకు సంబంధించి రైల్వే శాఖ నుంచి అధికారిక రిక్విజిషన్ అందిన వెంటనే కలెక్టర్లు అడ్వాన్స్ పొజెషన్ ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష జరిగింది. బహ్రైచ్--శ్రావస్తి--బలరాంపూర్--సిద్ధార్థనగర్--సంత్‌కబీర్‌నగర్ రైల్వే లైన్, కోల్‌కతా మెట్రో విస్తరణ, రాజస్థాన్ పునరుత్పాదక విద్యుత్ ట్రాన్స్మిషన్ ప్రాజెక్టులు, మహారాష్ట్ర వధవన్ పోర్ట్ కనెక్టివిటీ రహదారి ప్రాజెక్టు, భారత్‌మాల పరియోజన కింద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ప్రాజెక్టులపై కూడా చర్చించారు. స్వచ్ఛ భారత్ మిషన్--అర్బన్ 2.0 అమలు పురోగతిపై కూడా ప్రధానమంత్రి అన్ని రాష్ట్రాలతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్, రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌తో పాటు రాష్ట్రం నుంచి రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, సీసీఎల్ఏ జయలక్ష్మి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగం.. మానవత్వానికి బక్రీద్ సందేశం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్ :**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ త్యాగం, విశ్వాసం, అల్లాహ్ ఆజ్ఞల పట్ల సంపూర్ణ విధేయతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) చూపిన త్యాగం, సమర్పణ భావం మానవాళికి ఆదర్శమని అబ్దుల్ అజీజ్ అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ పండుగ సందేశం ఇస్తోందని తెలిపారు. పరస్పర ప్రేమ, సోదరభావం, మానవతా విలువలను మరింత బలోపేతం చేసుకునే అవకాశం బక్రీద్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో సామరస్యం, ఐక్యత పెంపొందాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. బక్రీద్ పర్వదినం రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, ఆరోగ్యం, సౌభాగ్యం, ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సఖ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# "మహానాడులో లోకేష్ మాస్టర్ స్ట్రోక్...

మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి రక్షణ న్యూస్ :**

తెలుగుదేశం పార్టీ మహానాడులో యువనేత నారా లోకేష్ ప్రసంగం పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. మహిళా సాధికారతపై చారిత్రాత్మక తీర్మానం ప్రవేశపెట్టడంతో పాటు, వైసీపీపై ఘాటు విమర్శలు చేస్తూ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. "పార్లమెంట్‌లో మహిళా బిల్లు పాస్ అయినా... కాకపోయినా... 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలి" అంటూ మహానాడు వేదికపై లోకేష్ ప్రకటించగానే సభ హర్షధ్వానాలతో మారుమోగింది. "ఇది మా సంకల్పం... మా బాధ్యత... మా కమిట్‌మెంట్" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా నిర్ణయాలు తీసుకునే నాయకులుగా ఎదగాలన్నదే టీడీపీ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. మహిళా సాధికారత విషయంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. "ఎన్నికల సమయంలో మహిళల గురించి మాట్లాడి... తర్వాత మరిచిపోయే పార్టీ మేము కాదు" అని వ్యాఖ్యానించారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసే రాజకీయ సంస్కృతిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చిన లోకేష్... "గాజులు తొడుక్కున్నావా, అమ్మాయిలా ఏడవొద్దు" వంటి వ్యాఖ్యలు సమాజంలో మారాలని అన్నారు. పాఠ్యపుస్తకాలలో కూడా మహిళలకు సమాన ప్రాధాన్యం కల్పించేలా మార్పులు తీసుకొస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు ఎన్ టీ . రామ రావు సేవలను గుర్తు చేసుకున్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, పద్మావతి విశ్వవిద్యాలయం వంటి సంస్కరణలు ఎన్టీఆర్ తీసుకొచ్చారని కొనియాడారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ... "ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా జదీచీ అనే మూడు అక్షరాలకు గౌరవం ఉంది" అన్నారు. "అప్పుడు ఐటీ... ఇప్పుడు ఏఐ... అప్పుడు హైటెక్ సిటీ... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ" అంటూ చంద్రబాబు విజన్‌ను వివరించారు.

వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన లోకేష్... "మాది గూగుల్... మీది గొడ్డలి", "మాది ఫైటర్ జెట్స్... మీది ఫ్యాక్షన్" అంటూ పంచ్ డైలాగ్‌లతో సభలో నవ్వులు పూయించారు. "బాబాయిని గొడ్డలితో చంపింది నిజం కాదా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

టీడీపీ కార్యకర్తల త్యాగాలను గుర్తు చేస్తూ... "కార్యకర్తే అధినేత" అన్న నినాదాన్ని మరోసారి ప్రస్తావించారు. 2019 నుంచి 2024 వరకు పార్టీ కోసం పోరాడిన కార్యకర్తల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు.

2024 ఎన్నికల్లో టీడీపీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ... 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని చెప్పారు. పింఛన్లు, మెగా డీఎస్సీ, ఉచిత విద్యుత్, దీపం-2, స్త్రీశక్తి వంటి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమని ప్రకటిస్తూ... "టైమ్, డేట్ మీరు ఫిక్స్ చేయండి... నేను రెడీ" అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. "ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ" కూటమి ప్రభుత్వ విధానమని తెలిపారు.

ఫేక్ ప్రచారాలపై కూడా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ సూచించారు. "నిజం గడప దాటేలోపే అబద్ధం ప్రపంచం చుట్టేస్తుంది" అంటూ సోషల్ మీడియా యుద్ధంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిస్తూ... "అహంకారం వద్దు... ప్రజలతో మమేకం అవ్వాలి" అని సూచించారు. "మిషన్ మోడ్‌లో పనిచేస్తే ప్రతి ఎన్నికలో గెలుపు మనదే" అని ధీమా వ్యక్తం చేశారు.

మొత్తంగా మహానాడు వేదికపై లోకేష్ ప్రసంగం మహిళా రిజర్వేషన్ల ప్రకటనతో చారిత్రాత్మక మలుపు తిరిగిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

# "మహానాడులో మహా జోష్...

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్**

తెలుగుదేశం పార్టీ మహానాడు ఈసారి హైబ్రీడ్, వర్చువల్ విధానంలో నిర్వహించినప్పటికీ... కార్యకర్తల్లో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "వాహనాల హోరు తగ్గిందేమో కానీ... మీలో జోష్ తగ్గలేదు" అంటూ ప్రారంభించిన ప్రసంగం మొత్తం సభలో ఉత్సాహాన్ని నింపింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా జరిగిన మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల నుంచి లక్షలాది కార్యకర్తలు వర్చువల్‌గా హాజరయ్యారు. తొలి రోజే 7.5 లక్షల మంది పాల్గొనడం చారిత్రాత్మకమని చంద్రబాబు పేర్కొన్నారు. "మీటింగ్ మోడల్ మారిందే తప్ప... మహానాడు విధానం మారలేదు" అంటూ పార్టీ ఆత్మను కార్యకర్తలకు గుర్తు చేశారు. "జాతీయ జెండా దేశానికి గౌరవం... పసుపు జెండా తెలుగు వారికి ఆత్మగౌరవం" అంటూ సభలో భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించారు. టీడీపీ ఎన్నికల కోసం రాజకీయాలు చేయదని... భవిష్యత్ తరాల కోసం పనిచేసే పార్టీ అని చంద్రబాబు స్పష్టం చేశారు. "టీడీపీ వర్క్స్ ఫర్ ది నెక్స్ట్ జనరేషన్ " అంటూ యువతకు ప్రత్యేక పిలుపునిచ్చారు. యువ శక్తిని సమర్థంగా వినియోగించుకుంటేనే ఆంధ్రప్రదేశ్ దేశానికి చోదకశక్తిగా మారుతుందని పేర్కొన్నారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా తరానికి అనుగుణంగా పాలసీలు రూపొందిస్తున్నామని, ఏఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలబెడతామని వెల్లడించారు. "ఎంప్లాయిగా కాదు... ఎంప్లాయర్‌గా ఎదగాలి" అంటూ యువతను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు మళ్లించారు. గత 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, 23 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 282 ప్రాజెక్టులకు ఆమోదం ఇచ్చినట్లు తెలిపారు. మహిళల సాధికారతపై కూడా చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటిస్తూ... మహిళల పోరాటాలకు గౌరవం తెలిపామని అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ తీసుకురావడాన్ని సభలో పలువురు నేతలు స్వాగతించారు. ఆస్తి హక్కు నుంచి ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల ప్రోత్సాహం వరకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను చంద్రబాబు వివరించారు. గత ఎన్నికల్లో మహిళలే పార్టీ విజయానికి కీలక శక్తిగా నిలిచారని కొనియాడారు. రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రి విస్తృతంగా మాట్లాడారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.14 వేలు ఇస్తున్నామని, పోలవరం ప్రాజెక్టును పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామని చెప్పారు. వెలిగొండ ఫేజ్-1, హంద్రీనీవా, జలధార-జలహారతి వంటి ప్రాజెక్టులను ప్రస్తావించారు. ప్రతిపక్ష వైసీపీపై చంద్రబాబు ఘాటు విమర్శలు గుప్పించారు. "వాళ్లకు గోల్ లేదు... అదొక అడ్డగోల్ బ్యాచ్" అంటూ పంచ్ డైలాగ్‌లతో విమర్శించారు. అమరావతి అంశంపై వైసీపీ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. "ప్రతిపక్షంలో అమరావతికి మద్దతు అన్నారు... అధికారంలో మూడు రాజధానులు అన్నారు... ఇప్పుడు మావిగన్ అంటున్నారు" అంటూ విమర్శించారు. "విషం కక్కడమే తెలుసు... విజన్ లేదు" అంటూ వైసీపీపై మండిపడ్డారు.

"పేదలకు కావాల్సింది పథకాలు... గొడ్డలి వేట్లు కాదు. యువతకు కావాల్సింది ఉద్యోగాలు... కత్తిపోట్లు కాదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రక్త చరిత్ర రాసేవాళ్లు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు" అంటూ రాజకీయ హింసను ఖండించారు. పార్టీ కేడర్‌పై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. "దేశంలో ఏ పార్టీకి లేని క్రమశిక్షణ టీడీపీ కేడర్ సొంతం" అని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన చంద్రబాబు... "పార్టీ ఫస్ట్... క్యాడర్ బెస్ట్" అనే నినాదంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నింపారు. మహానాడు వేదికగా ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ సిద్ధాంతాలు, రాజకీయ దిశపై చంద్రబాబు స్పష్టమైన సందేశం ఇవ్వడంతో... తొలి రోజు మహానాడు కార్యక్రమం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గోదావరి పవిత్రతపై కూటమి సర్కార్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్ :**

రాజమహేంద్రవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యటనతో అధికార యంత్రాంగంలో కొత్త స్ఫూర్తి, బాధ్యత పెరిగిందని అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం హుకుంపేట కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... గోదావరి పవిత్రత దెబ్బతింటే ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడదన్నారు.

గోదావరి నదిలోకి మురుగు నీరు, రసాయన వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే పరిశ్రమలకు తాళాలు వేసే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. "ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే జైలుకే పంపుతాం" అంటూ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నల్లా ఛానల్ ప్రాంతంలో స్వయంగా కాలుష్య పరిస్థితిని పరిశీలించారని మంత్రి తెలిపారు. గోదావరి కాలుష్య నివారణ కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డును నోడల్ ఏజెన్సీగా చేస్తూ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో కూడా జారీ చేసిందన్నారు.

త్వరలోనే గోదావరి నదిపై సమగ్ర "పొల్యూషన్ ఆడిట్" నిర్వహిస్తామని తెలిపారు. కాలుష్యానికి కారణమవుతున్న అంశాలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమలపై కూడా మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆంధ్రా పేపర్ మిల్లు యాజమాన్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.13 కోట్ల బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. కాలుష్య నియంత్రణ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 2027 గోదావరి మహా పుష్కరాల కోసం ప్రభుత్వం భారీ కార్యాచరణ సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఆరు జిల్లాల పరిధిలో రూ.8,500 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. పుష్కరాల సమయంలో దాదాపు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖ తరఫున రూ.100 కోట్ల నిధులు కేటాయించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కొనియాడారు. గ్రామ స్థాయి నుంచి ఘాట్ల అభివృద్ధి వరకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈసారి గోదావరి పుష్కరాలను పూర్తిగా "ప్లాస్టిక్ రహితం"గా నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గోదావరిని తల్లిలా కాపాడాలని పిలుపునిచ్చారు.

పుష్కర భక్తుల కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలు, హోమ్ స్టేలు, ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా ఒకే పుణ్యఫలం లభిస్తుందనే విషయంపై భక్తుల్లో అవగాహన పెంచుతామని చెప్పారు.

విజ్జేశ్వరం--సిద్ధాంతం ఏటిగట్టు రహదారి అభివృద్ధికి రూ.66 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ రహదారి అభివృద్ధితో పుష్కరాల సమయంలో భక్తుల రవాణాకు భారీగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును కేంద్ర సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జిలంక ప్రాంతాలను సుందరీకరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.

సినిమా రంగ అభివృద్ధిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పునరుద్ధరణపై ఎఫ్‌డీసీ ప్రత్యేకంగా కసరత్తు చేస్తోందన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి అబ్జర్వర్లు, నియోజకవర్గ స్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు.

"గోదావరి మన తల్లి... దాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత" అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

# విద్యుత్ అంతరాయాలపై అలర్ట్

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్ :**

రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు, ఈదురు గాలులు, అకాల వర్షాల ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇంధన శాఖ అప్రమత్తమైంది. ఈ పరిస్థితిపై బుధవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ... ప్రజలకు అంతరాయం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అధిక వేడి, గాలివానల కారణంగా ఫీడర్లు తెగిపోవడం, ట్రాన్స్‌మిషన్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వంటి సమస్యలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ముందుగానే సమాచారం చేరేలా మీడియా, బల్క్ మెసేజ్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని మంత్రి సూచించారు.

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, క్షేత్రస్థాయి సిబ్బంది మధ్య 1912 కాల్ సెంటర్లు కీలక సమన్వయ వేదికలుగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. 24 గంటల పాటు ఈ కాల్ సెంటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాల సమయంలో వేగంగా స్పందించేందుకు అదనపు సీపీటీ గ్యాంగులను ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించే విధంగా వ్యవస్థ ఉండాలని సూచించారు.

రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ల పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్లు, ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచేలా అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. దీర్ఘకాలికంగా విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేయాలని, ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించే దిశగా అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. వచ్చే పదేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలోని ఎస్‌ఈలు రోజువారీ టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. దీంతో సిబ్బందిలో జవాబుదారీతనం పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ, డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, సీఈలు, జిల్లా ఎస్‌ఈలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

## వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు

**కాళేశ్వరం,మే27(:** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపోయిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. అలాగే అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోశ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కలికంగా నిలిపివేశారు. పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వ హించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులవుతారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు.

# మాజీ సిం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత

**ఇడి అధికారుల కారుపై రాళ్లదాడి**

**దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు**

**అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం**

**తివనంతపురం,మే27:**కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే కేరళం మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్‌ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్‌ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును

కొట్టేయాలంటూ సీఎంఆర్‌ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.

# కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

**సిద్దరామయ్యను తప్పుకోవాలని అధిష్టానం సూచన**

**నేడు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం**

**30న డికె శివకుమార్ ప్రమాణం చేస్తారన్న ప్రచారం**

**సిద్దరామయ్యను రాజ్యసభకు పపంపాలని అధిష్టానం నిర్ణయం**

**న్యూఢిల్లీ,మే27():** కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. కాగా, ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. కర్ణాటకలో నాయకత్వ మార్పిడి సజావుగా పూర్తి చేసేందుకు కేంద్ర నాయకత్వం గట్టి కసరత్తే చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం సిద్ధరామయ్య సేవలను కేంద్ర స్థాయిలో ఉపయోగించు కునేందుకు వీలుగా ఆయనను రాజ్యసభకు పంపాలని పట్టుదలగా ఉంది. అయితే ఆలోచించుకునేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని సిద్ధరామయ్య కోరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడంతో సిద్ధరామయ్య ఎప్పుడు రాజీనామా చేస్తారు? డీకే ఎప్పటిలోగా ప్రమాణస్వీకారం చేస్తారనే అంశాలు ఆసక్తిరకంగా మారాయి. ఇందులో రెండు ఆప్షన్లు ఉన్నట్టు చెబుతున్నారు. ఒక ఆప్షన్ ప్రకారం ఈనెల 28న కానీ 29న కానీ సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఈవారం చివర్లో 30వ తేదీ డీకే కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చు. రెండో ఆప్షన్ ప్రకారం సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకునే విషయంలో జాప్యం తలెత్తవచ్చు. అదే జరిగితే జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు జరిగిన తర్వాతే సిద్ధరామయ్య రాజీనామా చేయడం, డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టడం జరుగుతుంది. ఇకపోతే కర్ణాటక నుంచి 4 రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, సంఖ్యాబలం ఆధారంగా 3 సీట్లను కాంగ్రెస్ సునాయాసంగా గెలుచుకుంటుంది. సిద్ధరామయ్యకు ఒక రాజ్యసభ సీటును కాంగ్రెస్ అదిష్ఠానం ఇప్పటికే ఆఫర్ ఇచ్చింది. రెండో సీటులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పోటీ చేసే అవకాశం ఉంది. ఖర్గే ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయన పదవీకాలం త్వరలో ముగియనుంది. కాగా, మూడో రాజ్యసభ సీటు డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. కాగా, కొత్త మంత్రివర్గంలో కనీసం ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉండాలని, తద్వారా 'పవర్ బ్యాలెన్స్'కు వీలుంటుందని సిద్ధరామయ్య వర్గం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. డీకే శివకుమార్ చేతిలో ప్రస్తుతం ఉన్న కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా ఆ వర్గం కోరుతున్నట్టు చెబుతున్నారు.

# మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

**జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు**

**మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్**

**జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం**

**మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ,మే27:** ప్రధాని నరేంద్ర మోడీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన

సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు.

జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సత్యకుమార్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తారీఖునే లబ్దిదారులకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం నెలకు దాదాపు 33 వేల కోట్ల రూపాయలను నేరుగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్రంలోని రైతులకు నిబంధనల ప్రకారం రూ.20,000లను వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటూ 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని వివరించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణాలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో కూడా జగన్ ఒక కోటరీని ఏర్పాటు చేసుకొని, కేవలం వాళ్లు చెప్పిన విషయాలనే వింటూ 'క్లౌడ్ నైన్' లో తిరిగేవారని.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉన్నట్టు తనకు అనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. 'పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా జగన్ వైఖరి ఉందన్న సత్యకుమార్.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి అరాచకాలు జరిగాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే రాష్ట్ర ప్రజలు మీ అరాచకాలను చూసి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఇక ఎన్నికల సంఘం చేపట్టే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ గురించి జగన్‌కు

కనీస అవగాహన ఉందో లేదో తెలియదని మంత్రి వ్యాఖ్యానించారు. ఇది రాజ్యాంగబద్ధంగా ఎప్పటికప్పుడు జరిగే ప్రక్రియ అని, ఓటర్లు ఎవరికీ అన్యాయం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చేసేందుకే ఈ సవరణలు ఉంటాయన్నారు. ఎవరైనా ఓటు మార్చుకోవాలన్నా, డూప్లికేషన్ లేదా దొంగ ఓట్లను తొలగించాలన్నా ఈ ప్రక్రియ ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ బాధ్యతాయుతమైన ప్రక్రియలను పక్కనబెట్టి, అసలు ఆంధ్రప్రదేశ్‌ను పశ్చిమ బెంగాల్‌తో జగన్ ఎందుకు పోలుస్తున్నారో ఆయనకే తెలియాలని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన తప్పేంటి

**అరెస్ట్ చేస్తామన్న ప్రచారంపై పాశం యాదగిరి ఆగ్రహం**

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై ఘాటు విమర్శలు**

**హైదరాబాద్,మే27():**ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగేశ్వర్ రావు చేసిన విమర్శల్లో అంత తప్పు ఏముందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను ప్రశ్నించారు. కేవలం విమర్శలు చేసినందుకే ఒక మేధావిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిని చేయడమే ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యూహాలపై, గత చరిత్రపై పాశం యాదగిరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ పచ్చగా, లాభసాటిగా ఉంటే అక్కడకి వెళ్లి మేసే పశువు తరహాలో, కేవలం అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే నాయకులు కూడా ఈరోజు నీతులు చెప్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు మరణానికి కారకుడైన వ్యక్తి, ఈరోజు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూర్చోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

# టిడిపి మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన

**మహానాడులో పాల్గొన్న ఆరు లక్షల మంది**

**అమరావతి,మే27:** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# మహిళలకు టిడిపి పెద్దపీట

**పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం**

**తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్**

**అమరావతి,మే27(:** మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

# దేశంలో 25శాతం పెట్టుబడులు ఎపికే

**రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేస్తాం**

**విశాఖ మహానాడు వేదికలో ఎంపి శ్రీభరత్**

**విశాఖపట్నం,మే27:**దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు.

టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో ఇంట్లోకి దూరిన చిరుత

**చాకచక్యంగా పట్టుకున్న అటవీ సిబ్బంది**

**ముంబై,మే27():**మహారాష్ట్రలోని అమరావతి నగరంలో జనాలతో రద్దీగా ఉండే రాంపూరి క్యాంప్ ప్రాంతంలోని ఒక ఇంట్లోకి హఠాత్తుగా ఒక చిరుత ప్రవేశించింది. ఆ నివాస ప్రాంతంలో చిరుత సంచరిస్తూ కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అటవీ శాఖ, పోలీసు సిబ్బంది, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించారు. రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగి భారీ ఆపరేషన్‌ను ప్రారంభించారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించిన అనంతరం ఎట్టకేలకు ఆ చిరుతను సురక్షితంగా బంధించారు. పట్టుబడిన ఆ చిరుతపులి వయస్సు సుమారు తొమ్మిది నుంచి పది నెలల వరకు ఉండవచ్చని రెస్క్యూ బృందం తెలిపింది. ఈ ఘటనపై అమరావతి మేయర్ శ్రీచంద్ తేజ్వానీ స్థానిక నివాసితులతో మాట్లాడారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. అధికారులు సకాలంలో స్పందించి చిరుతను బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

**రాష్ట్ర అభివృద్దికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి**

**పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ,మే27:** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

26–5–26 rakshana main_Layout 1 5/28/2026 12:40 AM Page 4






# మహానాడు












































Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District